సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం ׀ 5 ׀ సెప్టెంబర్ ׀ 2024



ఏరియా ఆసుపత్రిలో శస్త్రచికిత్స

చింతూరు: ఏరియా ఆసుపత్రిలో రవి అనే యువకుడికి 24 గంటల కడుపునొప్పికి శస్త్ర చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు.



గ్యాస్ సిలిండర్ల స్వాధీనం

రాజవొమ్మంగి: అక్రమంగా విక్రయిస్తున్న 20 వంట గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్టు తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు.



రహదారికి గండి

రాజవొమ్మంగి: డి.మల్లవరం గ్రామానికి వెళ్లే రహదారికి భారీ వర్షాలకు గండి పడింది. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.

న్యూస్‌రీల్

డెంగ్యూ మరణంపై జేసీ విచారణ



జిల్లా ఆస్పత్రిలో వివరాలు సేకరిస్తున్న జేసీ అభిషేక్ గౌడ్

పాడేరు : ఇటీవల పాడేరు పట్టణంలో చాకలిపేట వీధిలో సంభవించిన డెంగ్యూ మరణంపై బుధవారం స్థానిక జిల్లా ఆస్పత్రిలో జేసీ అభిషేక్ గౌడ్ విచారణ చేపట్టారు. జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వమిత్ర, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, ఆస్పత్రి సిబ్బంది నుంచి మరణానికి కారణాలను తెలుసుకున్నారు. విచారణ నివేదికను కలెక్టర్ దినేష్‌కుమార్‌కు అందజేస్తానని జేసీ తెలిపారు.

విద్యతోనే సమాజాభివృద్ధి

- అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణి



బూరుగుపుట్టు పాఠశాల ప్రారంభ క్రమంలో విద్యార్థులతో అరకు ఎంపీ తనూజరాణి

సాక్షి,పాడేరు: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని, బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండి బాగా చదువుకోవాలని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి సూచించారు. స్థానిక మండల పరిషత్ నిధులతో మరమ్మతులు, అభివృద్ధి చేసిన బరిసింగి పంచాయతీ బూరుగుపుట్టు ప్రాథమిక పాఠశాల భవనం, కొత్తగా నిర్మించిన తాగునీటి పథకాలను ఆమె ప్రారంభించారు. ఆమెకు గిరిజనులు ఘన స్వాగతం పలికారు. వైస్ ఎంపీపీ కుంతూరు కనకాలమ్మ, ఎంపీటీసీ చల్లా చిట్టమ్మ, వైఎస్సార్‌సీపీ కల్చరల్ విభాగం జిల్లా అధ్యక్షుడు గంపరాయి దిలీప్‌కుమార్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పాంగి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

చిల్డ్రన్ హోమ్‌ల్లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి,పాడేరు: జిల్లా ఐసీడీఎస్ కార్యాలయం పరిధిలోని చిల్డ్రన్ హోంలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్‌లో పనిచేసేందుకు పలు ఉద్యోగాలకు సంబంధించి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. 25 నుంచి 42ఏళ్ల లోపు వయసు ఉండి అసక్తి గల మహిళా అభ్యర్థులు ఈనెల 13 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యాలయం ఇన్‌చార్జి-1,కుక్-3, హెల్పర్ కమ్ నైట్ వాచ్ ఉమెన్-2, పీటీ ఇంస్ట్రక్టర్ కమ్ యోగా టీచర్-1, ఎడ్యుకేటర్ -3,ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కమ్ మ్యూజిక్ టీచర్-3 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. దరఖాస్తులను నేరుగా ఐసీడీఎస్ పీడీ కార్యాలయంలోగాని, రిజిస్టర్ పోస్టు ద్వారా గాని నిర్ణీత గడువులోగా సమర్పించాలని సూచించారు. వివరాలకు అల్లూరిసీతారామరాజు.ఏపీ.గవర్నమెంట్.ఇన్ వైబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

పురిటిలోనే శిశువు మృతి

రాజవొమ్మంగి: స్థానిక పీహెచ్‌సీలో పురిటిలోనే శిశువు మృతి చెందడంతో తల్లికి గర్భశోకం తప్పలేదు. మండలంలోని కిమ్మిలిగెడ్డ గ్రామానికి చెందిన గర్భిణి పుట్టపల్లి దివ్య ప్రసవ నిమిత్తం గత నెల 30న స్థానిక పీహెచ్‌సీలోని బర్త్ వెయిటింగ్ హాల్‌లో చేరింది. బుధవారం ఆమెకు పురిటిలోనే శిశువు మృతి చెందడంతో దివ్య కన్నీరుమున్నీరైంది. గర్భంలోనే శిశువు మృతి చెందిందని వైద్యాధికారి సుష్మ తెలిపారు.

అత్తను చంపిన కోడలు అరెస్టు

రాజవొమ్మంగి: మండలంలోని కొండపల్లి పంచాయతీ పరిధిలోని మర్రిపాలెంలో జరిగిన వృద్ధురాలి హత్య కేసులో నిందితురాలైన ఆమె కోడలు కొర్రా జ్యోతిని అరెస్టు చేసినట్లు ఎస్సై వెంకయ్య తెలిపారు. ఆమెను అడ్డతీగల కోర్టుకు తరలించగా బుధవారం న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. జ్యోతి తన నలుగురు చిన్న పిల్లలు, అత్త లక్ష్మితో మర్రిపాలెంలో గ్రామ శివారున ఓ తాటాకు పాకలో నివసిస్తోంది. భర్త వలస పనులకు వెళుతుంటాడు. అత్త తరచు తనకు వివాహేతర సంబంధాలు అంటగడుతూ వేధించడంతో కక్ష పెంచుకొన్న జ్యోతి ఆదివారం ఆమెపై రాత్రి కర్రతో దాడి జరుపగా మరణించిన సంగతి తెలిసిందే.

పొంగుతున్న వాగులు





వీఆర్‌పురం మండలంలో ముంపును గురైన రహదారిని పరిశీలిస్తున్న పీవో అపూర్వభరత్, సబ్ కలెక్టర్ కల్పశ్రీ, శబరి బ్రిడ్జి వద్ద ఉధృతంగా గోదావరి నది

- పెరుగుతున్న గోదావరి, శబరి నదుల నీటిమట్టాలు
- ప్రమాదస్థాయికి చేరుతుండటంతో విలీన మండలాల్లో ఆందోళన
- ఎగపోటుకు ముంపులో రహదారులు
- 48 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

చింతూరు: భద్రాచలంకు ఎగువనున్న తాలిపేరు, శ్రీరాంసాగర్, మేడిగడ్డ, శ్రీపాద ఎల్లంపల్లి, కంతనపల్లి, లక్ష్మీబ్యారేజీల నుంచి వస్తున్న వరదనీటితో భద్రాచలం వద్ద గోదావరి క్రమేపీ పెరుగుతోంది. దీంతో ఎటపాక, కూనవరం, వీఆర్‌పురం మండలాలకు వరదముప్పు పొంచి ఉంది. మరోవైపు గోదావరి పెరుగుతుండడంతో శబరినది ఎగపోటుకు గురై చింతూరు మండలంలో వాగులు పొంగుతున్నాయి. బుధవారం భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 43 అడుగులకు చేరడంతో మొదటి హెచ్చరికను జారీచేశారు. రాత్రికి నీటిమట్టం 44 అడుగులకు చేరుకుంది. గోదావరి, శబరి నదుల ప్రభావంతో విలీన మండలాల్లో రహదారులు ముంపుకుగురై 48 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎటపాక మండలంలో నెల్లిపాక నుంచి వీరాయిగూడెం వెళ్లే రహదారిపై వరదనీరు చేరడంతో మూడు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. వీఆర్‌పురం మండలంలో రామవరం రామవరప్పాడు, చింతరేగుపల్లి-కన్నాయిగూడెం, తుష్టివారి గూడెం-అడివివెంకన్న గూడెం, సీతంపేట-శ్రీరామగిరి, ఇప్పూరు-పోచవరం నడుమ వరదనీరు రహదారుల పైకి చేరడంతో 28 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.



చింతూరు మండలంలో గర్భిణులను పడవలో సోకిలేరు వాగు దాటిస్తున్న సిబ్బంది

- చింతూరు మండలంలో శబరినది పెరగడంతో సోకిలేరు వాగు ఎగపోటుకు గురై వరదనీరు రహదారిపైకి చేరింది. దీంతో చింతూరు, వీఆర్‌పురం మండలాల మధ్య, చింతూరు మండలంలో 11 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.
- చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ వీఆర్‌పురం మండలంలో వరదముంపులో రహదారులను పరిశీలించారు.
- సోకిలేరు వాగు పొంగడంతో ముకునూరు, నర్సింగపేట, రామన్నపాలెం, బొడ్రాయిగూడెం, చిన్నసీతనపల్లి, పెదశీతనపల్లి, కొండపల్లి, తిమ్మిరిగూడెం, ఏజీకొడేరు, ఉలుమూరు, మల్లెతోట గ్రామాలకు సైతం రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు సోకిలేరు వాగు వద్ద నాటుపడవను ఏర్పాటుచేసి గర్భిణులు, అత్యవసరమైన వారిని తరలిస్తున్నారు.

కూనవరం: గోదావరి, శబరి నదులు పొంగిప్రవహిస్తున్నాయి. కూనవరం వద్ద సాయంత్రం 4కు 16.74 మీటర్లు, ఆరు గంటలకు 17.26 మీటర్ల నీటిమట్టం నమోదైంది. గోదావరి ఎగపోటుకు రహదారులు నీటి మునిగాయి. కొండ్రాజుపేట రోడ్డుపైకి వరద నీరు భారీగా వరదనీరు చేరడంతో టేకులబోరు, కొండ్రాజుపేట గ్రామాల మధ్య ఆరు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. కూనవరం శబరి బ్రిడ్జి వద్ద లాంచీలు సిద్ధంగా ఉంచామని తహసీల్దార్ నాగబాబు తెలిపారు. మండల కేంద్రంలో ముంపునకు ఉదయ భాస్కర్ కాలనీ, గిన్నెల బజారును ఎంపీడీవో లక్ష్మిరెడ్డి, ఈవోఆర్డీ రామాంజనేయ ప్రసాద్, కార్యదర్శి సురేష్ సందర్శించి ప్రజలను అప్రమత్తం చేశారు.

పునరావాస కేంద్రాలకు తరలించండి : పీవో అపూర్వభరత్, సబ్ కలెక్టర్ కల్పశ్రీ ఆదేశం

చింతూరు: వరద మరింత పెరిగి గ్రామాల్లోకి ప్రవేశిస్తే అవసరమైన ప్రాంతాల్లో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ ఆదేశించారు. బుధవారం వారు ముంపునకు గురైన చింతరేగుపల్లి, శ్రీరామగిరి, జీడిగుప్పలో రహదారులను పరిశీలించారు.

- ప్రజలు ప్రమాదకరమైన వాగులు దాటకుండా తగిన చర్యలు చేపట్టాలని ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా ఆదేశించారు. బుధవారం ఆయన సోకిలేరు వాగు,శబరినది,అన్నవరం,కన్నాయిగూడెం, ఇప్పూరు వాగులను పరిశీలించారు. వాగుల వద్ద సిబ్బందిని కాపలా ఉంచాలని సీఐలు, ఎస్ఐలను ఆదేశించారు.



అన్నవరం వాగు ఉధృతిని పరిశీలిస్తున్న చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా



చంటిబిడ్డతో వాగు దాటుతున్న కుటుంబం



కొండ్రాజుపేట-టేకులబోరు రోడ్డుపై వరదనీరు



కూనవరం శబరి బ్రిడ్జివద్ద సిద్ధంగా లాంచీలు

కాసుల కోసం మెనూలో కోత

- బందవీధి ఆశ్రమంలో అక్రమాలు
- గిరిజన సంక్షేమశాఖ డీడీ, ఏటీడబ్ల్యూవోలే బాధ్యులు
- విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్‌కు పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు ఇస్తున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు,ఎస్టీ కమిషన్ సభ్యురాలు లిల్లీ

సాక్షి,పాడేరు: జి.మాడుగుల మండలంలోని బందవీధి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో మెనూ సక్రమంగా అమలు కావడం లేదని, ఇందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్‌కు పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఫిర్యాదు చేశారు. బుధవారం ఆయన ఎస్టీ కమిషన్ సభ్యురాలు జంపరంగి లిల్లీ, పార్టీ నేతలతో ఆయనను కలిశారు.గిరిజన సంక్షేమశాఖ డీడీ, ఏటీడబ్ల్యూవోలు కాసులకు కక్కుర్తి పడి మెనూలో కోతలు విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో మెనూ కచ్చితంగా అమలుచేసేలా చర్యలు తీసుకోవాలని, వాచ్‌మన్‌లను నియమించి, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు తెడబారికి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

క్రిమినల్ చర్యలు తీసుకోవాలని వినతి

బంధవీధి గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఇద్దరు టెన్త్ విద్యార్థినుల అదృశ్యం కేసులో బాధ్యులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కలెక్టర్ దినేష్ కుమార్‌కు ఆదివాసీ జేఏసీ కన్వీనర్ రామారావుదొర, ఇతర నాయకులు వినతిపత్రం అందజేశారు. బుధవారం వారంతా కలెక్టర్‌ను కలిసారు. ఇద్దరు బాలికలు అదృశ్యంపై తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. పాఠశాల నిర్వాహకులతో పాటు గిరిజన సంక్షేమ డీడీ, ఏటీడబ్ల్యూవోలపై శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు పెట్టి వెంటనే అరెస్ట్ చేయాలని వారు కోరారు.

ఫార్మసిస్ట్, శానిటరీ వర్కర్‌కు షోకాజ్..

హుకుంపేట: విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న శానిటరి వర్కర్ సరోజిని, ఫార్మసిస్ట్ చిట్టిబాబుకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీఎంహెచ్‌వో జమాల్‌బాషాను ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక పీహెచ్‌సీని సందర్శించారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై శానిటరి వర్కర్‌పై మండిపడ్డారు. మందులు అస్తవ్యస్తంగా పడేయడాన్ని గమనించిన ఆయన ఫార్మసిస్టుపై అసహనం వ్యక్తం చేశారు. వారిద్దరికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అనంతరం నక్కలపుట్టులో ఈఎంఆర్ఎస్ పాఠశాల స్థలాన్ని పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించారు. మెనూ విద్యాబోధనపై ఆరాతీశారు. పలు ప్రశ్నలకు విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. ఎంపీడీవో వెంకటరావు, తహసీల్దార్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

తీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు

ఐటీడీఏ పీవో అభిషేక్ హెచ్చరిక



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు : సహాయ గిరిజన సంక్షేమాధికారుల తీరు అధ్వానంగా ఉందని, ఇకపై మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవని ఐటీడీఏ పీవో అభిషేక్ హెచ్చరించారు. బుధవారం స్థానిక తలార్‌సింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల సహాయ గిరిజన సంక్షేమ అధికారులు, డీడీ కార్యాలయ సిబ్బందితో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏటీడబ్ల్యూవోలు, గిరిజన సంక్షేమ శాఖ డీడీ పని తీరుపై ఆగ్రహం, అసహనం వ్యక్తం చేశారు. జామిగూడ, బంధవీధి ఆశ్రమ పాఠశాలలో ఘటనలు ఏటీడబ్ల్యూవోల నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతోందన్నారు. ఆశ్రమ వసతి గృహాల్లో ప్రతి పూట విద్యార్థులకు తయారు చేసే ఆహార పదార్థాలు వాట్సప్‌లో షేర్ చేయాలని సూచించారు. డీడీ కార్యాలయంలో కొంతమంది అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. దీనిపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి కఠినంగా వ్యవహరిస్తామని పీవో హెచ్చరించారు.

రోడ్డెక్కిన కేజీబీవీ విద్యార్థినులు



మీడియాతో మాట్లాడుతున్న కిలగాడ కేజీబీవీ విద్యార్థినులు



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంపీడీవో కిరణ్‌కుమార్,ఎస్ఐ రవీంద్ర

- రుచీపచీ లేని భోజనం పెడుతున్నారని కిలగాడ విద్యార్థినుల ఆవేదన
- ప్రశ్నిస్తే ప్రిన్సిపాల్ జ్యోతి, అకౌంటెంట్ పుష్ప వేధిస్తున్నారని ధ్వజం
- వారిని బదిలీ చేయాలంటూ రోడ్డుపై బైఠాయింపు

ముంచంగిపుట్టు: మెనూ అమలు చేయకుండా రుచీపచీలేని భోజనం పెడుతున్నారంటూ మండలంలోని కిలగాడ కేజీబీవీ విద్యార్థినులు రోడ్డెక్కారు. దీనిపై ప్రశ్నిస్తే తమను ప్రిన్సిపాల్ జ్యోతి, అకౌంటెంట్ పుష్ప వేధిస్తున్నారని, వారిని బదిలీ చేయకుంటే తామంతా మూకుమ్మడిగా ఇళ్లకు వెళ్లిపోతామని వారు హెచ్చరించారు. బుధవారం కేజీబీవీలో చదువుతున్న 274 మంది విద్యార్థినులు తరగతులు బహిష్కరించి మండల కేంద్రంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెనూ అమలు చేయకపోవడమే కాకుండా ఉడకని అన్నం, రుచిలేని కూరలు పెడుతున్నారని వాపోయారు. దీనిపై ప్రశ్నిస్తే ప్రిన్సిపాల్, అకౌంటెంట్ దురుసుగా ప్రవర్తించడమే కాకుండా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు లేరని, అధ్వాన మరుగుదొడ్లతో ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. తనిఖీల నిమిత్తం వచ్చే మండల, జిల్లా స్థాయి అధికారులు తమతో మాట్లాడకుండానే ఉపాధ్యాయులతో మాట్లాడి, భోజనాలు చేసి వెళ్లిపోతున్నారన్నారు. తమ సమస్య వినేది, పట్టించుకునేది లేకపోవడంతో రోడ్డెక్కాల్సి వచ్చిందని వారు ధ్వజమెత్తారు. ప్రిన్సిపాల్ జ్యోతి, ఉపాధ్యాయులు అక్కడి వచ్చారు. స్కూల్‌కు వెళ్లమని వారిని కోరినా వారు పట్టించుకోలేదు. అక్కడికి వచ్చిన ఎంపీడీవో కిరణ్‌కుమార్, ఎస్ఐ రవీంద్ర సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. అనంతరం వారు కేజీబీవీకి వెళ్లి విద్యార్థినుల సమస్యలు తెలుసుకున్నారు. దీనిపై ప్రిన్సిపాల్ జ్యోతి మాట్లాడుతూ విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నామని చెప్పారు.

కలెక్టర్‌కు నివేదిస్తా

ఆందోళనకు దిగిన కిలగాడ కేజీబీవీ విద్యార్థినులతో జిల్లా గరల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కె.సూర్యకుమారి సమావేశమయ్యారు. తరగతుల వారీగా విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. మెనూ అమలు జరగడం లేదని, దీనిపై ప్రశ్నిస్తే ప్రిన్సిపాల్ జ్యోతి, అకౌంటెంట్ పుష్ప ఇబ్బందులు పెడుతున్నారని విద్యార్థినులు వివరించారు. వారిపై చర్యలు తీసుకోకుంటే ఇళ్లకు వెళ్లిపోతామని వారు స్పష్టం చేశారు. అనంతరం ఆమె ప్రిన్సిపాల్ జ్యోతి, ఉపాధ్యాయులను విచారించారు. అనంతరం సూర్యకుమారి మాట్లాడుతూ ఇక్కడి పరిస్థితులపై కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు.

సీఎస్సార్ నిధులతో దోమ తెరలు

- తొలివిడతలో 10 వేలు అందజేసిన కార్పొరేట్ కంపెనీలు
- రెండవ విడత రానున్న మరో 17వేలు
- వరద ప్రభావిత ప్రాంతాలకు 2,500 కేటాయింపు
- ఫలించిన అనకాపల్లి, అల్లూరి కలెక్టర్ దంపతులు దినేష్‌కుమార్, విజయ్‌కృష్ణన్ కృషి

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి,పాడేరు: జిల్లాలో దోమ తెరల సమస్య పరిష్కారానికి పాడేరు, అనకాపల్లి జిల్లాల కలెక్టర్ దంపతులు ఏఎస్ దినేష్‌కుమార్, విజయ్‌కృష్ణన్ చొరవ చూపారు. ఈనెల 27న 'పీలికలైన తెరలు..కరుణ చూపని పాలకులు' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ దినేష్‌కుమార్ స్పందించారు. అనకాపల్లి జిల్లా పరిధిలోని కార్పొరేట్ సంస్థలతో అనకాపల్లి కలెక్టర్ విజయ్‌కృష్ణన్, పాడేరు కలెక్టర్ దినేష్‌కుమార్ దంపతులు చర్చించి సీఎస్సార్ నిధులతో దోమతెరలను సమకూర్చారు. 11 కార్పొరేట్ సంస్థలు రూ.37.17 లక్షలతో 17 వేల దోమతెరలు కొనుగోలు చేశాయి. తోయోత్సు కంపెనీ మరో 10వేల దోమతెరల కొనుగోలుకు అంగీకారం తెలిపింది. హెటిరో ల్యాబ్స్ 2,500, వేసువ్యస్ 2,500, డెక్కన్ ఫైన్ కెమికల్స్ 2వేలు, పోరస్ లాబ్స్ 2వేలు, వసంత కెమికల్స్ వెయ్యి చొప్పున మొత్తం 10వేల దోమ తెరలు తొలివిడతగా బుధవారం పాడేరు చేరుకున్నాయి. మిగతా 17 వేలు రెండో విడతలో రానున్నాయి. మలేరియా పీడిత గ్రామాల్లోని ప్రజలకు వీటిని అత్యవసరంగా పంపిణీకి కలెక్టర్ చర్యలు తీసుకుంటున్నారు. వీటిలో 2,500 దోమ తెరలను చింతూరు డివిజన్ పరిధిలోని వీఆర్ పురం మండలంలో గోదావరి వరద ప్రభావిత బాధితులకు పంపిణీ చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ నిర్ణయించారు. ఈ మేరకు చింతూరు ప్రాంతానికి బయలుదేరిన వాహనాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్,జేసీ అభిషేక్‌గౌడ్ బుధవారం కలెక్టరేట్‌లో జెండా ఊపి ప్రారంభించారు. వెంటనే పంపిణీకి చర్యలు తీసుకోవాలని అక్కడి ఐటీడీఏ పీవో అపూర్వ భరత్‌ను కలెక్టర్ ఆదేశించారు. డీఆర్వో పద్మావతి, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా, డీఎంవో తులసి, సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



చింతూరు ప్రాంతానికి తరలిస్తున్న దోమతెరల వ్యాన్‌కు జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ అభిషేక్‌గౌడ్ తదితరులు

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

- అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



సాలేపుగొందిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం

హుకుంపేట: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. బుధవారం మండలంలోని కొట్నాపల్లి పంచాయతీలో ఆయన బుధవారం పర్యటించారు. సాలేపుగొందిలో జెడ్పీ నిధులు రూ.4లక్షలతో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. పందిమెట్టలో ఇటీవల వర్షాలకు కొట్టుకుపోయిన వంతెనను పరిశీలించారు. అనంతరం దిగమాలపాడు ప్రాథమిక పాఠశాలలో సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. సూచనలు చేశారు. సర్పంచ్ కాకరి బొంజుబాబు, నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి తిరుమల లడ్డూ విక్రయం

రంపచోడవరం: ఇక్కడికి సమీపంలోని ఐ.పోలవరం జంక్షన్ వద్ద టీటీడీ వేంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రంలో గురువారం నుంచి తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదం విక్రయం చేస్తున్నట్లు ఆలయ అధికారి నారాయణరాజు తెలిపారు. ఉదయం నివేదన తరువాత లడ్డూ విక్రయం ప్రారంభిస్తామని తెలిపారు.

స్కాబిస్ నివారణకు ప్రత్యేక వైద్యసేవలు

పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



స్కాబిస్ మాత్రలు మింగిస్తున్న పీవో అభిషేక్

పాడేరు : గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో స్కాబిస్ వ్యాధి సోకిన విద్యార్థులకు ప్రత్యేకంగా వైద్య సేవలు కల్పిస్తున్నామని ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. బుధవారం స్థానిక తలార్‌సింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు చర్మవ్యాధుల నిపుణులతో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 528 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 108 మందికి స్కాబిస్ వ్యాధి ఉన్నట్లు నిర్ధారించారు. వారితో పీవో మాత్రలను మింగించారు.పెరిమిత్రిన్ సబ్బులను పంపిణీ చేశారు. త్వరలో 117 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో స్కాబిస్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

టీడబ్ల్యూ డీడీ కొండలరావు, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, చర్మవ్యాధుల నిపుణులు డాక్టర్ లక్ష్మీసరోజిని, డాక్టర్ ఆనిరత్నం, డాక్టర్ ఎర్రయ్య పాల్గొన్నారు.

మద్యం దుకాణాలను ప్రైవేట్‌కు అప్పగించొద్దు

- సిబ్బంది వినతి



స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది

చింతూరు: మద్యం దుకాణాలను ప్రైవేటుకు అప్పగించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే ఈనెల 7న మద్యం దుకాణాల బంద్‌ను పాటిస్తామని రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు హెచ్చరించారు. ఈ మేరకు నాలుగు మండలాలకు చెందిన మద్యం దుకాణాల సిబ్బంది బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్‌కు వినతిపత్రం అందజేశారు.



గురుదేవోభవ

తల్లిదండ్రుల తరువాత...అంతటి గౌరవ స్థానం కల్పిస్తూ ఆచార్య దేవోభవ అంటూ గురువును దైవంతో సమానంగా పూజించే సమాజం మనది. గురువులు విద్యార్థులతో పాటు సమాజానికీ మార్గదర్శకంగా ఉంటారు. ఉపాధ్యాయ వృత్తిని ఒక బాధ్యతగా స్వీకరించి భావి పౌరులను సన్మార్గంలో పెట్టే గురుతర బాధ్యత గురువులది. చిన్నారులను క్రమశిక్షణలో పెట్టడంలో గురువుల కృషి ఎనలేనిది. సామాజిక సేవలోనూ తమదైన ముద్ర వేసుకుని మా మంచి మాస్టారు అంటూ అందరి మన్ననలు పొందుతున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి రోజున ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా... ఎందరో గురువులు...అందరికీ వందనాలు.

హుకుంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వంతినిభ బాలాజీ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ అందరికీ ఆదర్శంగా నిలుస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల అభిమానాన్ని కూడా పొందుతున్నారు. విద్యార్థులకు తానే స్వయంగా క్షవరం చేస్తుంటారు. సెలవు రోజుల్లో విద్యార్థులకు చర్మరోగాల రాకుండా ప్రకృతి వైద్యసేవలందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు.

దుంబ్రిగుడ: స్థానిక కేజీబీవీలో కాంట్రాక్టు ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్న కృష్ణకుమారి. తనకు వచ్చే అరకొర జీతంతో పేదల ఆకలి తీరుస్తున్నారు. రోజూ పేదలకు భోజనం అందజేస్తుంటారు. ప్రస్తుతం హ్యూమన్‌రైట్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలుగా పనిచేస్తున్నారు. ఆమె చేస్తున్న సేవలను గుర్తించి ఉత్తమ సీఆర్‌టీగా రెండుసార్లు అవార్డులు అందుకున్నారు. ఆమె మాట్లాడుతూ తన విద్యార్థులకు పాఠాలతో మానవ విలువలు, సేవాగుణం వంటివి వివరిస్తామని చెప్పారు. కోవిడ్ సమయంలో చేసినా సేవలకుగాను హూమన్‌రైట్స్ అండ్ ఎంటీ క్రైమ్ అసోసియేషన్ నుంచి 2021లో ఉత్తమ ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకున్నారు

ఎటపాక: విద్యాబోధనతో పాటు సమాజ సేవలోనూ ముందుండాలని ఉద్దేశంతో పలువురు ఉపాధ్యాయులు ఓ స్వచ్ఛంద సంస్థ పేరుతో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. కుసుమనపల్లి గ్రామంలో ఉన్నత చదువులు చదివి ఉపాధ్యాయులుగా స్థిరపడిన అపక రమేష్, సున్నం నాగేశ్వరరావు, సోడె ప్రసాద్, అపన నాగేశ్వరరావు తదితరులు ఓ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటుచేసుకొని గ్రామాల్లో పేద విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, ఫీజులు చెల్లించడం, పుస్తకాలు అందజేస్తున్నారు. దీంతో పాటు పేద రోగులకు ఆర్థిక సాయం అందిస్తున్నారు.

చదువుకున్న పాఠశాలలకే ప్రధానోపాధ్యాయులుగా

కొయ్యూరు: ఉపాధ్యాయులు చెప్పే విద్యాబుద్ధులు విని విద్యార్థిగా చదువుకొని మళ్లీ ఆ పాఠశాలలోనే ప్రధానోపాధ్యాయురాలుగా బోధన చేయడం ఒక ప్రత్యేకత.. చదివిన చోటకే ఉపాధ్యాయునిగా రావడమంటే ఎవరికైనా ఆనందంగా ఉంటుంది. చదివిన పాఠశాలలకే నేరుగా ప్రధానోపాధ్యాయులుగా వచ్చిన భావితరాల విద్యార్థులను మరింత బాధ్యత ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న మాస్టార్లు నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.



పేద గిరిజనులకు దుస్తులు అందజేస్తున్న కృష్ణకుమారి



ఆర్థిక సాయం అందిస్తున్న ఎటపాక ఉపాధ్యాయులు



విద్యార్థులకు క్షవరం చేస్తున్న హుకుంపేట హెచ్‌ఎం బాలాజీ



కోడ లక్ష్మి



ఎల్.రాంబాబు



రామరాజు పడాల్



పల్లాల లక్ష్మణరెడ్డి

ఎంఈవోగా...

కొయ్యూరు ఎంఈవో ఎల్.రాంబాబు 1983–1986లో కొయ్యూరు ప్రభుత్వోన్నత పాఠశాలలో చదువుకున్నారు. గతేడాది ఇదే పాఠశాలకు (కొయ్యూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల) ఆయన హెచ్‌ఎంగా నియమితులయ్యారు. కొయ్యూరు ఎంఈవోగా కూడా ఆయన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తాను చదివిన పాఠశాలకు హెచ్‌ఎంగా వస్తానని ఊహించలేదని ఆయన తెలిపారు. తాము చదివే రోజుల్లో పాఠశాలకు ఎలాంటి వసతులు ఉండేవి కాదని గుర్తు చేశారు. ప్రహరీ అసలు లేదన్నారు. నాటితో పోల్చితే నేడు విద్యార్థులకు అన్ని రకాల వసతులు వచ్చాయన్నారు. ఇక్కడ విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉండాలని తాము ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు.

ముంచంగిపుట్టు: ముంచంగిపుట్టు మండలం కిలగాడ గ్రామానికి చెందిన హెచ్‌ఎం కోడ లక్ష్మీ 1996–2000లో 6వ తరగతి నుంచి 10 వ తరగతి మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలిక పాఠశాల–1లో చదువుకున్నారు. ఇంటర్ సైతం ముంచంగిపుట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకున్నారు. ప్రస్తుతం ఆమె ఇదే పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. నాటి పాఠశాల రోజులను ఆమె గుర్తు చేసుకున్నారు. గుణాత్మక విద్య బోధిస్తూ వారి ఉజ్వల భవిష్యత్‌కు కృషి చేస్తున్నారు. చదివిన పాఠశాలలోనే హెచ్‌ఎంగా పనిచేయడం ఒక మధుర అనుభూతిని ఇస్తుందని లక్ష్మీ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చింతపల్లి: జీకే వీధి మండలం రింతాడ పంచాయతీకి దుచ్చరిపాలెం గ్రామానికి చెందిన సాగిన రామరాజు పడాల్ చింతపల్లిలోని గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. ఆయన విద్యార్థిగా ఇదే పాఠశాలలో 1988 నుంచి 1993 వరకు చదివారు. తరువాత ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడ్డారు. ప్రస్తుతం ఆయన చదివిన (చింతపల్లిలోని గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల) పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఇదే పాఠశాలకు హెచ్‌ఎంగా రావడం ఆనందంగా ఉందని చెప్పారు. గిరిజన విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

వై.రామవరం: మండల కేంద్రానికి చెందిన పల్లాల లక్ష్మణరెడ్డి స్థానిక గిరిజన సంక్షేమ పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. ఇదే పాఠశాలలో ఆయన అభ్యసించారు. గిరిజన విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమంటున్నారు. ఆయన రెండుసార్లు ఉత్తమ సేవ పురస్కారాలు అందుకున్నారు. ఈ పాఠశాలలోనే అభ్యసించి, ఇక్కడే హెచ్‌ఎంగా చేయడం ఆనందంగా ఉందని చెబుతున్నారు.

చదివిన పాఠశాలలోనే టీచర్లుగా...

వై.రామవరం: స్థానిక ఎంపీపీ పాఠశాలలో చదివి.. అక్కడే టీచర్‌గా రోలిపల్లి హరితకుమారి కొనసాగుతున్నారు. చదివిన పాఠశాలలోనే నాటి ఉపాధ్యాయులైన కొందరితో నేడు పనిచేయడం ఆనందంగా ఉందన్నారు. ఉపాధ్యాయుడైన తన తండ్రి రోలిపల్లి కామరాజు ప్రోత్సాహంతోనే ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకున్నట్టు చెప్పారు. ఆమె ఈ ఏడాది ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు.

గంగవరం: స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో చదివి అక్కడే ఉపాధ్యాయురాలిగా మడకం లావణ్య కొనసాగుతున్నారు. చిన్ననాటి నుంచి టీచర్ కావాలనే ఆకాంక్ష నెరవేరిందని, చదివిన తరగతి గదిలోనే టీచర్‌గా పాఠాలు బోధించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులను మరింత ఉన్నతస్థాయిలో చూడాలన్నదే తన లక్ష్యమన్నారు.



రోలిపల్లి హరిత



లావణ్య



కూడా రవీంద్రబాబు

చింతపల్లి: డిగ్రీ కళాశాలలో 2014–17 విద్యా సంవత్సరంలో కూడా రవీంద్రబాబు డిగ్రీ అభ్యసించారు. ప్రస్తుతం ఆయన ఇదే కాలేజీలో అధ్యాపకునిగా కొనసాగుతున్నారు. తాను చదివిన తరగతి గదిలో నేటి తరం విద్యార్థులు పాఠాలు బోధించడం ఆనందంగా ఉందని చెప్పారు.

నాడు స్నేహితులుగా.. నేడు టీచర్లుగా

మండలంలో పెదబరడ పంచాయతీ సిరిపురం గ్రామానికి చెందిన బోయిన చంద్రవతి, కుండే వీరమ్మలు చింతపల్లి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నారు. ప్రస్తుతం వారిద్దరు అదే పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. చదివిన పాఠశాలలో స్నేహితులుగా ఉన్న మేము అదే పాఠశాలలో సహచర ఉపాధ్యాయులుగా చేయడం ఆనందంగా ఉందని చెబుతున్నారు.



బోయిన చంద్రవతి, కుండే వీరమ్మ

ఒకే కుటుంబంలో నలుగురు ఉపాధ్యాయులు

చింతపల్లి: మండలంలోని చౌడుపల్లిలో దేపూరి వెంగలయ్య, వరహాలమ్మ దంపతులకు నలుగురు కొడుకులున్నారు.వారంతా ఉపాధ్యాయులు కావడం విశేషం. పెద్ద కుమారుడు మురళి అనకాపల్లి జిల్లా దువ్వాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీటీగా, రెండో కుమారుడు శశికుమార్ లంబసింగి మామిడిబంధలో ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయుడిగా, మూడో కుమారుడు సునీల్ కుమార్ గూడెం కొత్తవీధి మండలంలో, నాలుగో కుమారుడు ఓం కార్ జి.మాడుగులలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన తల్లిదండ్రులు తామంతా ఉపాధ్యాయులుగా ఉండాలని కన్న కలలను సాకారం చేశామన్నారు. గిరిజన విద్యాభివృద్ధికి తమ వంతు కృసి చేస్తామన్నారు.



ఉపాధ్యాయులుగా నలుగురు అన్నదమ్ములు

తండ్రి బాటలో తనయులు

అరకులోయటౌన్: మండలం,లోని మాడగడ గ్రామ పంచాయతీ, బోసుబెడ గ్రామంలోని నిరుపేద వ్యవసాయ కుటుంబానికి చెందిన పంచాడి అప్పలరాజు కష్టపడి చదివి తనకు నచ్చిన ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. తన తనయులను కూడా అదే బాటలో నడిపిస్తున్నారు. డుంబ్రిగుడ మండలం సొవ్వా ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. చదువుపై ఉన్న మమకారం, గిరిజనులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలనే ఆకాంక్షతో తనయులను సైతం ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగించాలన్న ఉద్దేశంతో తన ఇద్దరు కుమారులకు ఉన్నత విద్య చదివించి, తన కలను సాకారం చేసుకున్నారు. మాస్టరు అప్పలరాజు పెద్ద కుమారుడు పంచాడి శేఖర్ ప్రస్తుతం అనంతగిరి మండలం చిలకలగెడ్డ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఉపాధాయుడిగా పనిచేస్తుండగా, రెండవ కుమారుడు పంచాడి ప్రవీణ్‌కుమార్ ప్రస్తుతం వద్దాది మాడుగుల మండలం కొత్తవలస ఎంపీపీ పాఠశాలలో ఉపాధాయుడిగా కొనసాగుతున్నాడు.



పంచాడి అప్పలరాజు



పంచాడి శేఖర్



పంచాడి ప్రవీణ్‌కుమార్

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

సాక్షి, పాడేరు: మండల కేంద్రంలోని విద్యార్థులకు మట్టి గణపతి విగ్రహాలను పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు బుధవారం పంపిణీ చేశారు. పాడేరుకు చెందిన మోద కిరణ్ మణికంఠ అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మాజీ ఎంపీపీ ఎస్.వి.వి. రమణమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కోటిబాబునాయుడు, సభ్యుడు రమణ, నాయకులు సూర్యనారాయణ, సుబ్రహ్మణ్యం, ట్రస్ట్ అధ్యక్షుడు శివరాత్రి శ్రీనివాసకుమార్, సభ్యులు వెంకటముకుందు, దేముళ్లు, కొండలరావు, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు

అరకులోయటౌన్/డుంబ్రిగుడ: అరకులోయలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్ విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. మట్టి విగ్రహాలతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. వైస్ ప్రిన్స్‌పాల్ డాక్టర్ కె.పుష్పరాజ్, ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు నాగబాబు, విజయలక్ష్మీ, మొష్యా, అనితకుమారి తదితరులు పాల్గొన్నారు. డుంబ్రిగుడలోని కేజీబీవీలో విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాలను తయారుచేశారు. ప్రిన్సిపాల్ భవాని, వైస్ ప్రిన్సిపాల్ సుజాత, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.



పాడేరులో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

పాఠశాల భవనాలు ప్రారంభం

పాడేరు: వంజంగి హిల్స్ ద్వారా సమకూరిన నిధులు రూ.70లక్షలతో ఆధునికీకరణ చేసిన మండలంలోని కొత్తవలస, ఎస్.కొత్తూరు, కాడెలి ప్రాంతాల్లోని పాఠశాలలను ఐటీడీఏ పీవో వి.అభిషేక్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పర్యాటక సీజన్‌లో చెక్‌పోస్టు ఏర్పాటు ద్వారా టికెట్ల రూపేణా సుమారు రూ.25లక్షల ఆదాయం వచ్చిందన్నారు. ఆయా నిధులను వంజంగి హిల్స్‌కు ఆనుకొని ఉన్న గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులకు వెచ్చించడం గొప్ప విషయమన్నారు. ఏటా సీజన్‌లో రూ.35లక్షల వరకు ఆదాయం వస్తున్నట్టు అంచనా వేశామన్నారు. వంజంగి హిల్స్‌పై పారా మోటారింగ్ ఫ్లయింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వంజంగి బోలేంగమ్మ తల్లీ ఆదివాసీ సంప్రదాయ కేంద్రాన్ని సందర్శించారు. ఎంపీడీవో సాయి నవీన్, తహసీల్దార్ వి. త్రినాధరావు, ఎంఈవో సరస్వతి, సర్పంచ్‌లు వంతాల బొంజుబాబు, పార్వతమ్మ, వనుగు బసవన్నదొర, ఎంపీటీసీ సభ్యుడు లకే రామకృష్ణపాత్రుడు, తదితరులు పాల్గొన్నారు.

కళ్లద్దాల పంపిణీ

హుకుంపేట: మండలంలోని తీగలవలస పంచాయతీ ఓలుబెడ్డా గ్రామంలో నిర్వహించిన కళ్లద్దాలు పంపిణి కార్యక్రమంలో ఐటీడీఏ పీవో వి.అభిషేక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడేరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించడంతో పాటు రోగులను స్వగ్రామాలకు పంపే బాధ్యతను ఐటీడీఏ తీసుకుంటుందన్నారు. ఓల్లుబెడ్డా, భీమవరం, గుమ్మడివరం, రణంకోట గ్రామాల్లో శిబిరాలు నిర్వహించి కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేశామన్నారు. సహాయ గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎల్.రజని, ఈవోపీఆర్డి అప్పలరాజు, సర్పంచ్ పాంగి బేసు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

క్రీడలతో మానసిక ఉల్లాసం

డుంబ్రిగుడ: మండలంలోని జాముగుడ ఆశ్రమ పాఠశాలను అరకులోయ సీఐ హిమగిరి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. వాలీబాల్ కిట్‌లను పంపిణీ చేశారు. ఎస్ఐ సంతోష్ కుమార్, హెచ్‌ఎం అప్పలమ్మ తదితరులు పాల్గొన్నారు.

మండల ప్రత్యేకాధికారిగా జాన్‌రాజ్

రాజవొమ్మంగి: మండల ప్రత్యేకాధికారిగా జాన్‌రాజ్ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

మెరుగైన సేవలందించాలి

వై.రామవరం: ప్రజలకు మెరుగైన సేవలందించాలని మండల ప్రత్యేకాధికారి చిట్టిబాబు, వివిధ శాఖల అధికారులు సిబ్బందికి సూచించారు. ఓడీఎఫ్ సర్వే వేగవంతం చేయాలని, గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీవో బాపన్నదొర, తహసీల్దార్ అనుసూయ, డీటీ సుధాకరరావు, ఎంఈవో తాతబ్బాయిదొర, ఏపీఓలు సాయిబాబా, స్వామి, ఏఓ ఉషారాణి, ఈవోపీఆర్డీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాడేరు సీఐగా దీనబంధు

పాడేరు : పాడేరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా డి.దీనబంధు బుధవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేసిన డి.నవీన్‌కుమార్ జిల్లా పోలీస్ శాఖ కార్యాలయంలో క్రైం ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు. దీనబంధును పలువురు అభినందనలు తెలిపారు.



56 మందికి వైద్య పరీక్షలు

రాజవొమ్మంగి: మండలంలోని ఎర్రంపాడు గ్రామంలో బుధవారం నిర్వహించిన ఫ్యామిలి డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 56 మందికి వైద్య పరీక్షలు చేశారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

డుంబ్రిగుడ/అరకులోయ రూరల్: మండలంలోని అరకు పంచాయతీ కేంద్రంలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు చటారి జానకమ్మ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. సర్పంచ్ శారద, ఎంపీటీసీ వరహాలమ్మ తదితరులు పాల్గొన్నారు.కొత్తభల్లుగుడ, సుంకరమెట్ట పంచాయతీల పరిధిలో సుమారు 20 అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఆవశ్యకతపై అంగన్‌వాడీ కార్యకర్త దురియా లలితకుమారి అవగాహన కల్పించారు.

ఆస్పత్రిలో పనులకు ప్రతిపాదనలు

వై.రామవరం: మండలంలోని చవిటిదిబ్బలు పీహెచ్‌సీలో బుధవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆస్పత్రిలో సమస్యలు, అవసరమైన సౌకర్యాలపై ప్రతిపాదనలు తయారుచేశారు. ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, ఎంపీడీవో బాపన్నదొర, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దినేష్, వైద్యాధికారి నరేంద్ర పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

మారేడుమిల్లి: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సార్ల లలిత కుమారి అధ్యక్షతన బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో వీరా కిషోర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి, అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నారాయణ, డాక్టర్లు హరికృష్ణ, సుబ్రహ్మణ్యం, ఏఈ శ్రీనివాస్ , కో–ఆప్షన్ సభ్యుడు ధర్మరాజు, తహసీల్దార్ సుబ్బారావు, పరిపాలాధికారి జయంతి, వైస్ ఎంపీపీ లత, సర్పంచ్‌లు జాకబ్, ప్రభాకర్ రెడ్డి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జీసీసీ బీఎంగా విజయలక్ష్మి బాధ్యతల స్వీకరణ



బీఎం విజయలక్ష్మికి అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

అడ్డతీగల: జీసీసీ అడ్డతీగల ఇన్‌చార్జి బ్రాంచ్ మేనేజర్‌గా విజయలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె ప్రస్తుతం రాజవొమ్మంగి బీఎంగా పనిచేస్తున్నారు. ఆమెను పలువురు కలిసి అభినందనలు తెలిపారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

రంపచోడవరం: తామరలపల్లి పంచాయతీ పరిధిలోని నూనెపల్లి ఎంపీపీ పాఠశాలను సర్పంచ్ మిర్తివాడ ఆనందరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు వంశీ కుంజం బుధవారం సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని మెరుగైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

సమస్యలు పరిష్కరించాలి

డుంబ్రిగుడ: జాముగుడ పాఠశాలను ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకురాలు సుజాతసాల్మన్ బుధవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలన్నారు.

చిన్నారుల మృతిపై విచారణ చేయాలి

చింతూరు: మండలంలో చిన్నారులు మృతి చెందడంపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకుడు సీసం సురేష్ డిమాండ్ చేశారు. ఏరియా ఆస్పత్రిలో వంద పడకలను ఏర్పాటుచేసి తగిన గదులను, స్పెషలిస్టు వైద్యులను, సిబ్బందిని నియమించాలని ఆ డిమాండ్ చేశారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



కామరాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

జి.మాడుగుల: మండలంలో భీరం పంచాయతీ సలమరంగి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు(గృహసారధి)కొౌరి కామరాజు ఇటీవల మృతి చెందారు. మృతుడి కుటుంబాన్ని పాడేరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని మృతుడి కుటుంబసభ్యులకు భరోసా ఇచ్చారు. సర్పంచ్‌లు రామకృష్ణ, కొండబాబు, ఎంపీటీసీ సభ్యులు విజయకుమారి, సన్యాసిదొర, చిన్నారావు, ఏఎంసీ డైరెక్టర్ల బాబూరావు, అరుణ్, వెంకట్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మురుగునీరు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

చింతూరు: స్థానిక నర్సింహాపురం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ఎదురుగా ఉన్న మురుగునీటిని బుధవారం తొలగించారు. గత నెల 17వ తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన 'మురుగు కూపాలు' అనే శీర్షికకు అధికారులు స్పందించారు. ఈ మేరకు చింతూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసాదరావు పొక్లెయిన్ సాయంతో ఆశ్రమ పాఠశాల వసతి గృహం, సిబ్బంది నివాస గృహాలు, ఏటీడబ్ల్యూవో కార్యాలయం, గిరిజన బాలికల సెల్ఫ్ మేనేజ్‌మెంట్ వసతిగృహం ప్రహరీల వద్ద ఉన్న మురుగు, చెత్తాచెదారం, పూడికతీత పనులు చేయించారు. పారిశుధ్య పనులు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను వెలికితీసి పరిష్కరించిన 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.



గుంతలో మురుగునీరు, పూడికను తొలగిస్తున్న దృశ్యం